# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 06-02-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **విద్యుత్ కొనుగోలు వ్యయాన్ని తగ్గించేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు.**
2. **ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గం ఈ ఉదయం 11 గంటలకు సమావేశం కానుంది.**
3. **సామాజిక న్యాయానికి తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు.**
4. **ఆంధ్రప్రదేశ్ లో ఐటీ రంగం అభివృద్ధికి సహకరించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరినట్లు ఆ శాఖ మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు.**
5. **తెలంగాణలో జరిగిన ఉపాధ్యాయ అర్హత పరీక్ష టెట్ ఫలితాలను పాఠశాల విద్యాశాఖ విడుదల చేసింది.**

==========================

విద్యుత్ కొనుగోలు వ్యయాన్ని తగ్గించేలా చర్యలు చేపట్టాలని ఇంధనశాఖ అధికారులను ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో వేసవిలో విద్యుత్‌శాఖ సన్నద్ధతపై అధికారులతో ఆయన నిన్న సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ సాంకేతికత ఆధారంగా విద్యుత్ అవసరాల అంచనాలను రూపొందించాలని సూచించారు. విద్యుత్ అంతరాయాలను సాధ్యమైనంత మేరకు తగ్గించాలన్నారు. తరచూ విద్యుత్ అంతరాయం తలెత్తే ప్రాంతాల్లో కారణాలను గుర్తించి పరిష్కరించాలని చెప్పారు.

-------------------------

ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గం ఈ ఉదయం 11 గంటలకు సమావేశం కానుంది. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశంలో పలు అంశాలపై చర్చించనున్నారని అధికారులు తెలిపారు. 22-ఏ భూములు, విశాఖపట్నం పంచగ్రామాల సమస్య, రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి-ఎస్ఐపీబీలో ప్రాజెక్టుల ఆమోదం పైనా చర్చించే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

-------------------------

సామాజిక న్యాయానికి తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు.

హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయంలో నిన్న నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కులగణన సర్వేలో పాల్గొనని వారు ముందుకొచ్చి సమాచారం అందిస్తే తీసుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని వెల్లడించారు. సామాజిక, ప్రభుత్వ విధానపరమైన నిర్ణయాల అమలుకు సర్వే సమాచారం ఉపయోగపడుతుందని భట్టి విక్రమార్క తెలియజేస్తూ,

...వాయిస్..34 సెకన్లు

----------------------------

పోలవరం ప్రాజెక్టు పనులను వేగవంతం చేయడంతో పాటు నిర్వాసితులకు 1000 కోట్ల రూపాయల మేర పరిహారం చెల్లించామని ఆంధ్రప్రదేశ్ జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా నిడదవోలులో ఎమ్మెల్సీ ఎన్నికలపై కూటమి నాయకులతో మంత్రి నిన్న సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం రైతులకు 1640 కోట్ల రూపాయల ధాన్యం బకాయిలను చెల్లించిందన్నారు. 20 లక్షల ఉద్యోగాలు కల్పించే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని రామానాయుడు పేర్కొన్నారు.

----------------------------

ఆంధ్రప్రదేశ్‌లో ఐటీ రంగం అభివృద్ధికి సహకరించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరినట్లు ఆ శాఖ మంత్రి నారా లోకేశ్ తెలిపారు. ఢిల్లీలో పలువురు కేంద్రమంత్రులను కలిసిన అనంతరం ఆయన నిన్న పాత్రికేయులతో మాట్లాడుతూ, రాష్ట్రంలో స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ గురించి కేంద్ర మంత్రులకు వివరించామని చెప్పారు. రాష్ట్రంలో ఐటీ సేవలు, గ్రీన్ హైడ్రోజన్, పునరుత్పాదక ఇంధన రంగాన్ని విస్తరిస్తామని తెలిపారు. విద్యాసంస్థల్లో మౌలిక వసతుల కల్పనకు సాయం అందించాలని కోరినట్లు మంత్రి తెలియజేస్తూ,

వాయిస్... 32 సెకన్లు

----------------------------

తెలంగాణలో జరిగిన ఉపాధ్యాయ అర్హత పరీక్ష –టెట్ ఫలితాలను పాఠశాల విద్యాశాఖ విడుదల చేసింది. జనవరి 2 నుంచి 20 తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన ఈ టెట్ పరీక్షలకు లక్షా 35 వేల 802 మంది హాజరయ్యారు. వీరిలో 31.21 శాతం మేర 42 వేల 384 మంది అర్హత సాధించినట్లు అధికారులు వెల్లడించారు. ఇటీవల సబ్జెక్టుల వారీగా ప్రాథమిక కీ, రెస్పాన్స్ షీట్లు విడుదల చేసిన పాఠశాల విద్యాశాఖ అధికారులు.. జనవరి 27వరకు అభ్యంతరాలు స్వీకరించి తాజాగా తుది కీ, ఫలితాలను ప్రకటించారు.

----------------------------

పరిశ్రమల్లో భద్రతపై ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేస్తామని ఆంధ్రప్రదేశ్ హోంశాఖ మంత్రి వి.అనిత తెలిపారు. అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం హెటెరో ఔషధ పరిశ్రమలో ఇటీవల విషవాయువు లీకై అస్వస్థతకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను ఆమె నిన్న పరామర్శించారు. అనంతరం మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ,

వాయిస్ ... 25 సెకన్లు

----------------------------

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల ఆరోగ్యబీమా పథకం అమలుపై రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. తెలంగాణలో ఆ రాష్ట్ర వైద్య విద్యా సంస్థ–డీఎంఈ గుర్తించిన ఆసుపత్రుల్లో ఆంధ్ర ఉద్యోగులు చికిత్స పొందేందుకు అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు సంబంధిత ఆసుపత్రులను గుర్తించాలని ఎన్టీఆర్ వైద్యసేవ సీఈవోను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆదేశించింది.

---------------------------

ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయడంలో విఫలమైందని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైయస్ జగన్మోహన్ రెడ్డి అన్నారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని పార్టీ కార్యాలయంలో విజయవాడ నగరపాలక సంస్థలోని ఆ పార్టీ కార్పొరేటర్లు, ముఖ్య నాయకులతో ఆయన నిన్న సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జగన్మోహన్ రెడ్డి మాట్లాడుతూ,

…వాయిస్…26 సెకన్లు

---------------------------

అర్హులైన రైతుల ఖాతాల్లో రైతు భరోసా నిధులను జమ చేస్తున్నామని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. హైదరాబాద్‌లో మంత్రి నిన్న మాట్లాడుతూ, రైతు భరోసాలో మొదటి విడతగా ఎకరం వరకు సాగు భూమి ఉన్న దాదాపు 17.03 లక్షల రైతుల ఖాతాల్లో నిధులు జమ చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.నాలుగు పథకాల అమలులో భాగంగా గణతంత్ర దినోత్సవం నాడు రైతు భరోసా నిధులను ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. 32 జిల్లాల్లోని 563 గ్రామాల్లో 4 లక్షల 41 వేల 911 మంది రైతులకు ఒక్కో ఎకరానికి మొదటి విడతగా 6 వేల రూపాయల పెట్టుబడి సాయం అందించిందని మంత్రి పేర్కొన్నారు.

---------------------------

స్వాతంత్ర్య సమరయోధులు, సరిహద్దు గాంధీగా పేరు గాంచిన భారతరత్న ఖాన్ అబ్దుల్ గఫార్ ఖాన్ జయంతి ఈరోజు. స్వాతంత్ర్య సంగ్రామంలో మహాత్మా గాంధీతో కలిసి పాల్గొన్న ఆయన… 1890 ఫిబ్రవరి 6వ తేదీన బ్రిటీష్ ఇండియాలోని వాయువ్య సరిహద్దు రాష్ట్రం ఉస్మాన్ జెయిలో జన్మించారు. రెడ్ షర్ట్ – ఎర్రచొక్కాల ఉద్యమం ప్రారంభించిన గఫార్ ఖాన్ భారత విభజనను తీవ్రంగా వ్యతిరేకించారు. సరిహద్దు గాంధీగా పేరుగాంచిన ఆయన.. భారతరత్నను అందుకున్న తొలి భారతీయేతరులు కావడం విశేషం.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని రంపచోడవరం నియోజకవర్గాన్ని ప్రత్యేక జిల్లాగా ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసువెళ్లినట్లు గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పేర్కొన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ అభ్యర్థి ఎన్నికల ప్రచార అంశంపై నిన్న రంపచోడవరంలో నిర్వహించిన సమావేశంలో ఆమె పాల్గొన్నారు.

=====================